"పదరా అవతలకీ" అన్నాడు 223 నెంబరు కానిస్టేబు. "బాగా చేశాడు లంజాకొడుకు, నాకేబులో సొమ్ము కూడాపోయిందిరా దేముడా"అని మనసులో అనుకొని వీడినితందామని త్రోవకాచి కూర్చున్నాడు సుంద్రావు. "అయ్యా! సెలవుతీసుకొంటా"అని సబిన్స్పెక్టరుగారితో చెప్పి అచ్చట బంట్రోతులకు రెండు రూపాయిలిచ్చి అడ్డత్రోవపడ్డాడు మన బ్రాహ్మడు. పాపం, సుంద్రావు, పన్నెండుగంటలదాక తిండి లేక వీడికోసం కాచికూర్చొని ఆఖరకు "ఆలో లక్ష్మణా"అని ఏడుస్తూ యింటికిపోయేడు. కథ కంచి కెళ్లింది. మనం ఇంటికొచ్చేం.

## నూనెగుడ్డలవాడు

శ్రీమతి బసవరాజు వేంకటరాజ్యలక్ష్మమ్మగారు

రామారావుగారు భీమవరంలో కొత్తగా ఇల్లుకట్టుకుని గృహప్రవేశమైనారు. ఆయన డిప్టీకలెక్టరుఉద్యోగంచేసి నాలుగువందలరూపాయలు పింఛను తీసుకుంటున్నారు. సిరీసంపదా అన్నివిధములా బాగానేవున్నవి. పింఛను తీసుకున్నాముగదా అని ఒకవూరిలోనే వుండవచ్చునసీ సొంతయిల్లు కట్టుకున్నారు. ఏమిటో యిల్లుకట్టినప్పటినుంచీ ఆయనకు కొంచెము సుస్తీగానేయున్నది వంట్లో. కాని అల్లాగే తిరుగుతున్నారు. రోజురోజుకీ మనిషి శుష్కించి పోతున్నాడు. ఇంతలోకే దేవీనవరాత్రములు వచ్చినవి. పార్వతినిపూజిస్తే ఆయన ఆరోగ్యము బాగుపడునని భార్యాభర్తలిద్దరూ కలశంపెట్టి తొమ్మిదిరోజులూ భక్తితో పార్వతిని పూజించేరు. తమ ఆరోగ్యము కాపాడమని దేవికి భక్తితో నమస్కరించేరు. కాని రోజురోజుకూ మంచంమీదనుంచే లేవలేకపోతున్నారు. చివరకు ఒకరోజు రామారావుగారింట్లోఅంతా ఆయనఆరోగ్యంవిషయమై ఆశలువదలుకొని విచారంగావున్నారు. ఆసమయానికి ఒకనూనెగుడ్డలవాడు ముష్టికివచ్చి "అంబాపలుకు, జగదంబాపలుకు, శాంభవీ పలుకు! ఈఇంట్లో ఒకకష్టం వచ్చింది. రేపటితో యీయింటియజమానికి ఆయుర్దాయం సరి"అన్నాడు. అందరూ "వీడిమాటలకేమిటి? వీడికి ముష్టిపెట్టలేదని ఇల్లాగేచెపుతాడు. పోపొ"మ్మన్నారు. రామారావుగారిభార్యమాత్రం అలాఒప్పుకోక ఆనూనెగుడ్డలవాడిని "నీచేతనైతే ఏదైనాచేస్తావా?"అని అడిగింది. "నేనుచెప్పినట్లుచేస్తే బాగవుతుం"దన్నాడు వాడు. "ఈక్షణమే మీసింహద్వారము పడగొట్ట"మన్నాడు. అందరూ వీడికేమైన పిచ్చా అనుకున్నారు. కాని రామారావుగారిభార్యమాత్రం ఏవిధముచేతనైనా తనభర్తబాగుంటే చాలని సింహద్వారం పడగొట్టమంది. అందరూవద్దన్నారు. అందు కానూనెగుడ్డలవాడు "అమ్మా! మీసింహద్వారం ఎత్తేకముందు వడ్రంగిదరువాజాచేసి సీలలుబిగించకుండా వెళ్లేడు. ఒకతాచు అందులో ప్రవేసించింది. అది వడ్రంగిచూడకుండా సీలలుబిగించేడు. పాము ఆరోజుమొదలు గాలీ ఆహారములేక లోపలశుష్కిస్తూంది. అందుకని యజమాని కాపాపము కొట్టి యిలాఅయినారు. దానికి రేపటితోసరి. ఈయనకీ రేపటితోసరి ఆయుర్దాయం. ఈసింహద్వారం పడగొట్టి సీలలుఊడదీయిస్తే పాము బయటికివస్తుంది. అప్పటినుంచీ యజమానికి ఆరోగ్యం బాగవుతుం"దన్నాడు. ఆమాటలు నిజమేమిటో అందరూచూడాలను

కున్నారు. "ఇందులో పాములేకపోతే నీబుఱ్ఱ రామకీర్తనమే" అన్నారు వాడిని. సరేనన్నాడు నూనెగుడ్డలవాడు. వెంటనే వడ్రంగినిపిలిపించి దర్వాజాపడగొట్టించి సీలలు ఊడదీయించేరు. అందులోనుంచి తెల్లనితాచు శల్యావశిష్టమై కొనఊపిరితో పైకివచ్చింది. అప్పు డానూనెగుడ్డలవాడు పళ్లెంలో పాలుపోయించి పాముచేతతాగించేడు. పాముకడుపునిండాతాగి ప్రాణాలుచేరుకున్న తర్వాత బుసకొట్టుకుంటూ పోయింది. అప్పటినుంచీ రామారావుగారికి రోగం తిరుగుముఖమైంది. రోజురోజుకూ ఆరోగ్యవంతులైనారు. ఆనూనెగుడ్డలవాడి మేలు మరిచిపోక వాడిని అప్పుడప్పుడుపిలిచి ఏమయినా యిస్తూండేవారు.

# గణించువారొకరు, గుణించువారింకొకరు

శ్రీమతి సత్యవతీకన్యగారు

ఒక గ్రామములో ఇరువురు బ్రాహ్మణదంపతులుండిరి. వారిద్దరును పొట్టకు, బట్టకు విశేషద్రవ్యము వెచ్చింపగూడదను నియమముగలవారై కడుపునిండ తిండిదినక, శుభ్రమైనబట్టగట్టక వేలకొలది ద్రవ్యమార్జించి తమ యింటిలోనున్న ఒక పెద్దరాతికి కన్నమొనరించి అందులో నాద్రవ్యమంతయు బడనైచి ఆరాతిపై రాత్రింబవళ్లు ఒకరువిడిచి యొకరు పండుకొనుచు అతిజాగరూకతతో మెలంగుచుండెడివారు. వారట్లుకావించుచుండుట ఇంకొక బ్రాహ్మణుడెరింగి ఆరాతిలో ధనముండవచ్చునని యుద్దేశించి ఒకనాటిరాత్రి గూఢముగా వారియింటప్రవేశించి ఒకమూలదాగియుండెను. అంత వాదంపతు లెప్పటివలె నారాతిపైబండుకొని నిదుర బోనసాగిరి. మూలనున్న బ్రాహ్మణుండదియంతయు గనిపెట్టుచు సమయమాలోచించుచుండెను. కొంతవడి కాదంపతులిరువురు నిదురమత్తుచే రాతిపైనుండి కొంచెమొత్తిగిల్లినందున బ్రాహ్మణుడదియే తగినసమయమని యెంచి తానారాతిపై మెల్లగాపండుకొని రాతిమధ్యమున అమర్పబడియున్న మూతనుతీసి అందులోచేయిబెట్టి గుప్పెడురూపాయలు పైకితీయుచుండగా ధనలక్ష్మి ప్రత్యక్షమై వానిచెంపపై నొకదెబ్బకొట్టి ఆరూపాయలు లాగుకొని అందుబడవేసెను. అంతబ్రాహ్మణు డాధనలక్ష్మికాళ్లపైబడి అమ్మా! నేను మిక్కిలిబీదవాడను. రెండుగుప్పెళ్ల ధనమిచ్చినచో నాపిల్లలు, నేనును సుఖముగా బ్రతికెదమని వేడుకొన ధనలక్ష్మి యిట్లనియె: ఓవెఱ్ఱివాడా! ఈధనము వీరిదికాదు. దీనియజమాని పిఠాపురమను గ్రామమున ఒకయుద్యోగివద్ద బట్టలనుతుకుచాకలివాడు. నీవాతనియొద్దకేగి నన్నుప్రార్థించినరీతి నతనిని ప్రార్థించి వానిచేవ్రాలుగల ఒకచీటిని దెచ్చినచో నీవుకోరినధనము బడయగలవని చెప్పిన బ్రాహ్మణుండామాటల కాశ్చర్యమొంది అమ్మా! నీవు ధనలక్ష్మివైయుండుదువని నేదలంచుచున్నాను. కాని నీవాక్యములు నాకు మహాద్భుతములుగానున్నవి. అట్టి కష్టములుబడి వీరు సంపాదించిన ద్రవ్యమునకు ఎక్కడనోయున్న రజకుడు యజమానియని నీవిప్పుడు చెప్పిన వాక్యములు సమంజసములుగా దోచుటలేదనివచింప ధనలక్ష్మి ఓబ్రాహ్మణుడా! నేను చెప్పినదానిలో అబద్ధమేమియులేదు. వీరు సంపాదించిన ధనమంతయు ఆచాకలివానిదగుటచేతనే వీరిందులో నొక్కపైసయైన ఖర్చుపెట్టుటకు శక్తిగనజాలకున్నారు. ఇది లోకస్వభావమే. ఇందులో వింతయెంతమాత్రమునులేదు. నీదీనస్థితి జూడ నాకుమిక్కిలి జాలికలుగుచున్నది. కాని నేనాయదృష్టవంతుని ధనమునీకీయజాలను. కావున నీవాతని యనుజ్ఞవడసిరమ్మని చెప్పుటయు నాతడటనుండి వెంటనే వెడలిపోయి పిఠాపురమునకేగి అచ్చటనొక యుద్యోగియొద్ద నౌకరిచేయు వెంకటేశునిగాంచి యాతని వెనువెంట దిరుగుచుండెను. వెంకటేశు అతని చర్యయంతయు జూచి ఈబ్రాహ్మణుండెవడో నన్నాశ్రయించి తిరుగుచున్నవాడు, వీనివృత్తాంతంబడిగి

833